క్లుప్తంగా

వేగవంతంగా నాడు-నేడు పనులు



పన్నూరులో నిర్మిస్తున్న అదనపు తరగదులు

విజయపురం (నగరి): మండలంలోని పన్నూరు ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. సెకండ్ ఫేజ్ కింద సుమారు రూ. 24లక్షలతో అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నారు. ఇది వరకే రూ. 40లక్షలతో నాడు-నేడు పనులు చేశారు. త్వరలో రెండు అదనపు గదులు పూర్తి చేయనున్నట్లు గురువారం ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్‌రాజు తెలిపారు.

ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

విజయపురం (నగరి): మండలంలోని మాధవరం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ పి.గణేష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకుగాను మొదటి విడత బుధవారం నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని లేదా సర్టిఫికెట్ల నకళ్లతో జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను తమ కళాశాలలో నేరుగా చేర్పవచ్చన్నారు. అదే రోజు సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాలని, చిత్తూరు ఐటీఐ కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకి హాజరు కావాల్సి ఉంటుందని, ఇదే విషయాన్ని ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8639790174, 6303156450, 9885320544 సంప్రదించాలని సూచించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అంతకు ముందు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. సకల దేవతలను ఆహ్వానించి ధ్వజారోహణం చేశారు. ఉత్సవాలు 10 రోజుల పాటు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. ప్రతిరోజూ మధ్యాహ్నం హరికథ, రాత్రి వీధి నాటక ప్రదర్శన ఉంటుందన్నారు. ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేసినట్లు చెప్పారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి సేవలో తరించాలని కోరారు.


భోగేశ్వరస్వామి శివలింగ ప్రతిష్ఠ



భోగేశ్వరస్వామి శివలింగానికి హోమపూజలు చేస్తున్న అర్చక, వేదపండితులు

రేణిగుంట: శ్రీకాళహస్తి మండలం తొండమాన్‌పురంలోని భోగేశ్వరస్వామి శివలింగాన్ని గురువారం ఆలయ పండితులు పునఃప్రతిష్ఠకు హోమ పూజలు చేశారు. వందేళ్ల కిందట శిథిలావస్థలో మూలన పడి ఉన్న భోగేశ్వరస్వామి శివలింగాన్ని పునఃప్రతిష్ఠించాలని గ్రామస్తులు తీర్మానం మేరకు గురువారం ప్రత్యేక హోమపూజలు చేసి ధాన్యంలో విగ్రహాన్ని భద్రపరిచారు. 21వ రోజు విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ తెలిపింది.

భక్తిప్రపత్తులతో అగ్నిగుండ ప్రవేశం



అగ్నిగుండంలో ప్రవేశిస్తున్న భక్తులు

ఏర్పేడు: మండలంలోని రాజుపాలెంలో గురువారం తెల్లవారుజామున పాండురంగ స్వామి అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని భక్తిప్రపత్తులతో నిర్వహించారు. తొలుత స్వామివారి చిత్రపటానికి విశేష పూజలు చేశారు. అనంతరం అగ్నిగుండంలో ప్రవేశించే భక్తులు కంకణాలు ధరించి, 9 బావుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, పసుపు దుస్తులు ధరించి, గోవిందనామ స్మరణతో నిలుచున్నారు. స్వామివారి చిత్రపటాన్ని అగ్నిగుండం వద్దకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఆలయ పూజారి అగ్నిగుండంలో పూల బంతిని వేసి ప్రవేశించగా భక్తులు ఆయనను అనుసరించారు. పలు ప్రాంతాల భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరు పరిశీలన

చిత్తూరు అర్బన్: నగరంలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు, ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును నగర కమిషనర్ జె అరుణ గురువారం రాత్రి పరిశీలించారు. నగరంలో గాంధీ విగ్రహ కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. గాంధీ కూడలిలోని పలుమార్గాల్లో, ఎమ్మెస్సార్, దర్గా కూడలిలో నూతనంగా ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ పనితీరును కమిషనర్ అరుణ, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ పోలీసులతో కలిసి పరిశీలించారు.

‘సప్లిమెంటరీ’.. డోంట్ వర్రీ

గతంలో ఎన్నడు లేని విధంగా పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తోంది. కెరీర్ విషయంలో డోంట్‌వర్రీ అని వారిలో స్థయిర్యం నింపే ప్రయత్నం చేస్తోంది. ఒకప్పుడు పది ఫెయిల్ అయితే ఏకంగా విద్యా సంవత్సరాన్ని కోల్పేయే ప్రమాదం ఉండేది. అయితే ఈ ఏడాది నుంచి రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారికి ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తూండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లో హర్షం వ్యక్తమవుతోంది.





పన్నూరు ఉన్నత పాఠశాలలో సప్లిమెంటరీ విద్యార్థులకు నిర్వహిస్తున్న తరగతులు

- విద్యా సంవత్సరం నష్టపోరాదని ప్రభుత్వం చర్యలు
- టెన్త్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వ స్కూళ్లలో శిక్షణ

నగరి: నగరి నియోజకవర్గంలోని నగరి మండలంలో 1,019 మంది పరీక్షలకు హాజరుకాగా 415 మంది పరీక్ష తప్పారు. అలాగే విజయపురం మండలంలో 207 మందికి 77, నింద్ర మండలంలో 206 మందికి 71 మంది పరీక్ష తప్పారు. అత్యధికంగా మ్యాథ్స్, సోషియల్, సైన్స్‌లోనే చాలా మంది ఫెయిలవ్వడం గమనార్హం! ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విద్యాశాఖ ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తోంది. గతంలో కేవలం విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పైనే దృష్టి పెట్టేవారు. అయితే పరీక్ష తప్పిన విద్యార్థులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ఆయా ఉన్నత పాఠశాలల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.30 గంట వరకు ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నారు.

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి శిక్షణ ఇస్తున్నాం. ఏ సబ్జెక్టులో ఫెయిలైతే ఆ సబ్జెక్టు ఉపాధ్యాయునితో పాఠాలు చెప్పించడంతో పాటు ప్రత్యేక టెస్టు పెడుతున్నాం. దీంతో విద్యా సంవత్సరాన్ని కోల్పోకుండా ఉంటారు. విద్యార్థుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపడం సంతోషదాయకం. –శ్రీధర్‌రాజు, హెచ్‌ఎం, విజయపురం

తల్లిదండ్రులలో ఆనందం



సప్లిమెంటరీ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే తమ తోటివారితో కలిసి ఇంటర్మీడియెట్‌లో చేరడానికి అవకాశం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక తరగతులతో శిక్షణ ఇప్పిస్తోంది. దీనిపై తల్లిదండ్రులు కూడా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. –సుధ, ఉపాధ్యాయురాలు, పన్నూరు

విద్యార్థులకు మంచి అవకాశం



గతంలో ఎన్నడూ లేనివిధంగా పరీక్ష తప్పిన విద్యార్థులకు పాఠశాలలోనే ప్రత్యేక తరగతులు నిర్వహించడం మంచి అవకాశం. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టిసారించి బోధన చేస్తున్నాం. దీనిని విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని సప్లిమెంటరీ పరీక్షల్లో పాసవ్వాలి. –ఆనందమ్మ, ఉపాధ్యాయురాలు, పన్నూరు

ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలి

పాలసముద్రం: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. ఆయన గురువారం వనదుర్గాపురం సచివాలయాన్ని సందర్శించి, రికార్డులు పరిశీలించారు. సిబ్బంది ప్రతి రోజూ ఉదయం 9.30 గంటలకు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలన్నారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజల నుంచి విజ్ఞప్తులు తీసుకోవడానికి సచివాలయంలో అందుబాటులో ఉండాలని సూచించారు. స్పందనలో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడూ ప్రజల సమస్యలను పరిష్కరించాలని పేర్కొన్నారు. ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఇంజినీరు అసిస్టెంట్ జయరాజ్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

సుబ్రమణ్యస్వామికి షష్టిపూజలు



ప్రత్యేక అలంకరణలో వళ్లీ, దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి

కార్వేటినగరం: కార్వేటినగరం ప్రసిద్ధి స్కంధపుష్కరిణి సమీపంలో వెలసిన వళ్లీ, దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయంలో గురువారం షష్టి పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి మూల విరాట్‌కు అర్చనలు, అభిషేకాలు చేపట్టారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్ర, సుగంధభరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ క్రమంలో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు పాటిస్తే ఆదాయం

నగరి: సస్యరక్షణ చర్యలు పాటిస్తే మామిడి సాగులో ఆదాయం పొందవచ్చని జిల్లా ఉద్యాన అధికారి డి.మధుసూదన్ రెడ్డి అన్నారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ అధ్వర్యంలో నగరి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో రైతు భరోసా కేంద్రాల విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్, విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్, విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్, మల్టీపర్పస్ ఎక్స్‌టెన్షన్ అధికారులకు మామిడి కాయల వృద్ధి, కోత దశలో చేపట్టవలసిన పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పక్వానికి వచ్చిన మామిడి కాయలను దశలవారీగా కోస్తే మంచి దిగుబడి పొందడంతోపాటు మంచి ధర వస్తుందని పేర్కొన్నారు. కాల్షియం కార్బైడ్ వాడి మామిడి కాయలను మాగపెట్టరాదన్నారు. జిల్లా వ్యవసాయ సలహా సాంకేతిక బదలాయింపు కేంద్రాల శాస్త్రవేత్త రాఘవేంద్ర మాట్లాడుతూ, పండు ఈగ నివారణ బుట్టలు ఎకరాకు 8 చొప్పున కడితే మామిడిపై ఈ ఈగను నివారించవచ్చన్నారు. అలాగే కాయకోత తరువాత తప్పనిసరిగా కొమ్మ కత్తిరింపులు చేసి బోర్డియాక్ పేస్టు పూయాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జె.మురళీకృష్ణ మాట్లాడుతూ, ఆర్కా మేంగో స్పెషల్ లీటరుకు 5 గ్రాముల చొప్పున కలిపి మామిడి పంటలో వాడితే దిగుబడి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీహెచ్ కోటేశ్వరరావు, ఏడీఏ సౌభాగ్య లక్ష్మి, ఏఓ రాఘవేంద్ర, ఉద్యాన అధికారి లోకేష్, నగరి, నింద్ర, విజయపురం మండలాల రైతు భరోసా సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి

14400 యాప్‌పై అవగాహన కల్పించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్ఐ బి సురేష్

పాలసముద్రం: అవినీతి రహిత మండలంగా తీర్చిదిద్దాలంటే ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన 14400 మొబైల్ యాప్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఎస్ఐ బి సురేష్ తెలిపారు. పోలీసు సిబ్బందికి గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సేవలకు ఎవరైనా లంచం అడిగితే వెంటనే ఫోన్ ద్వారా ఆడియో/వీడియో రికార్డు చేసి మొబైల్ యాప్‌కు పంపించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారని, ఇదే విషయం విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. గ్రామాల్లో బహిరంగ ప్రదేశాలు, ప్రభుత్వ కార్యాలయం ఎదుట ఈ పోస్టర్లను అతికించాలని తెలిపారు. అనంతరం ఏఎస్ఐ మురుగేష్, చక్రవర్తితో కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు.

మహిళలు ఆర్థిక సుస్థిరతను సాధించాలి

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల మహిళలు ఆర్థిక సుస్థిరత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ తెలిపారు. మండల మహిళ సమాఖ్య పరిధిలో సంఘమిత్రలు, వీఓ లీడర్లతో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎం ఫరీద్ మస్తాన్ మాట్లాడుతూ మొబైల్ బుక్ కీపింగ్‌ను వంద శాతం పూర్తి చేయాలని తెలిపారు. స్త్రీనిధి రికవరీలు పూర్తిగా వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ చిరంజీవి, సంఘమిత్రలు మురగయ్య, మంజుల, శోభ, వీఓ లీడర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్

గ్రామాల్లో జలం పుష్కలం

- ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి కనెక్షన్
- గ్రామీణులకు సురక్షిత మంచి నీటి సరఫరా

వెదురుకుప్పం: గ్రామీణ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పుష్కలంగా ఉన్నాయి. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం అన్ని రకాలు చేపడుతోంది. 2024 నాటికి పూర్తి స్థాయిలో సురక్షిత మంచి నీటి సరఫరా చేయాలన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తోంది. గతంలో ఎన్నడూ లేని విదంగా గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకు నిర్మాణాలు చేపట్టి, కొత్తగా బోర్లు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం జల జీవన్ మిషన్(జేజేఎం) కింద నిధులు మంజూరు చేసి గ్రామాల్లో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణాలు చేపడుతోంది. జనాబా ప్రాతిపదికన నిధులు కేటాయించి అవసరానికి సరిపడా సామర్థ్యం గల ట్యాంకుల నిర్మిస్తోంది.

అందరికీ తాగునీరు

గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడమే జలజీవన్ మిషన్ ముఖ్య ఉద్దేశం. అందులో భాగంగానే ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయి ఏర్పాటు చేయాలని సంకల్పించింది. రోజుకి మనిషికి సగటున 55 లీటర్ల నీటిని అందించాలన్నదే ప్రభుత్వ ఆశయం. 2019 నుంచి 2024 వరకు ఈ పథకం ద్వారా గ్రామాల్లో సురక్షిత మంచి నీటిని అందించేందుకు టెండర్లు పిలిచి ట్యాంకు నిర్మాణాలు చేపడుతోంది.

రూ.76 కోట్లతో పనులు

నీటి సమస్య జఠిలంగా ఉన్న గ్రామాలను గుర్తించిన ప్రభుత్వం తాగునీటి ఎద్దడి నివారణకు జల జీవన్ మిషన్ కింద మండలానికి రూ.76 కోట్లు మంజూరు చేసింది. మొత్తం 109 గ్రామాల్లో తాగునీటిని అందించడమే లక్ష్యంగా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జీఓ నం. 56 కింద 101 పనులు మంజూరు కాగా జీఓ నంబర్ 918 కింద 8 పనులు మంజూరు అయినట్లు అధికారులు వెల్లడించారు. మంజూరైన నిధులతో కొత్తగా బోర్లు వేసి ఓహెచ్ఎస్ నిర్మాణాలు చేపట్టి తాగునీరు అందించనున్నారు.





వెదురుకుప్పంలో పూర్తైన ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణం, పాతగుంటలో నిర్మాణంలో ఉన్న ట్యాంకు

నిర్మాణంలో ఉన్న నీటి ట్యాంకులు

వెదురుకుప్పంలో రూ.25.30 లక్షలతో 40 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో చేపట్టిన ట్యాంకు నిర్మాణం పూర్తయింది. అగ్గిచేనుపల్లె దళితవాడలో రూ.22.29 లక్షలు, ఆళ్లమడుగులో రూ.22.10 లక్షలు, బొమ్మయ్యపల్లెలో రూ.33.79 లక్షలు, ఎగువ కన్నికాపురంలో రూ.15.27 లక్షలు, నచ్చుకూరు దళితవాడలో రూ.18.13 లక్షలు, దాసరికాలనీలో రూ.25.39 లక్షలు, బలిజపల్లె దళితవాడలో రూ.24.20 లక్షలు, పాతగుంటలో రూ.24.78లక్షలు, చెంచుగుడిలో రూ.25.01 లక్షలు, వడ్డి ఇండ్లులో రూ.13.03లక్షలు, వెదురుకుప్పం ఎస్టీ కాలనీలో రూ.12.90 లక్షల నిధులతో చేపడుతున్న ట్యాంకు నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. టెండర్ దశల్లో 12 ట్యాంకులు ఉన్నాయి. మంజూరైన గ్రామాల్లో సకాలంలో పనులు చేపట్టేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరితగతిన పూర్తిచేయాలి



గ్రామాల్లో ట్యాంకుల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి. ఇప్పటికే 12 గ్రామాల్లో ట్యాంకులు నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన గ్రామాల్లో కూడా నిర్మాణపు పనులు చేపట్టేలా చర్యలు తీసుకొంటాం. మండలంలో నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నదే ప్రధాన ఆశయం. దీని కోసం ప్రత్యేక నిధులు కూడా వెచ్చిస్తాం. నిర్మాణాలు పూర్తిగా ఉన్నత స్థాయి అధికారుల పర్యవేక్షణలో జరుగుతోంది. కాంట్రాక్టర్లు సకాలంలో స్పందించాలి. పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు సహకరించాలి.

–తిమ్మరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వెదురుకుప్పం

గంగమ్మను దర్శించుకున్న మంత్రి రోజా



విజయపురంలో గంగమ్మను దర్శించుకుంటున్న మంత్రి ఆర్కే రోజా

విజయపురం (నగరి): విజయపురం మండల కేంద్రంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజా బుధవారం అర్ధరాత్రి గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించారు. రాష్ట్ర ప్రజలను చల్లగా చూడాలని అమ్మవారిని మొక్కినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు గోపి, వైస్ ఎంపీపీ బాలాజి, దశరథరాజు, సర్పంచ్ జబమేరి, భాస్కర్‌రాజు, నాయకులు ప్రసన్నకుమార్, సతీష్, సుబ్రమణ్యంరాజు, శివరాజు పాల్గొన్నారు.

సమన్వయంతో మరింత ముందుకు..

నగరి: సమన్వయంతో పాఠశాలలను మరింత ముందుకు తీసుకెళదామని ఎంఈఓ శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పాఠశాల వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు, మహిళా పోలీసులు, అంగన్‌వాడీ టీచర్లకు సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయన్నారు. ప్రతి విభాగానికి సంబంధించిన వారు విధులను సక్రమంగా నిర్వహించి పాఠశాల ఉన్నతికి సహకారం ఇవ్వాలని కోరారు. పాఠశాల మానిటరింగ్ కమిటీ ప్రత్యేక చొరవ చూపాలన్నారు. పాఠశాలలకు అందాల్సిన జగనన్న విద్యాకానుక వివరాలు, రక్తహీనత గల విద్యార్థినుల సమాచారం, 2005 నుంచి 2018 వరకు పాఠశాలల పరివర్తన సమాచారం సేకరించి ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని సదుపాయాలను తల్లిదండ్రులకు వివరించి విద్యార్థులను వందశాతం నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ శేషగిరిరావు, సీడీపీఓ కృష్ణవేణి, ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ

పంచాయతీలకు ఆధునిక పరికరాల పంపిణీ

పుత్తూరు రూరల్: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా ప్రతి పంచాయతీకి ఆధునిక పరికరాలను ప్రభుత్వం అందజేస్తున్నట్లు ఎంపీపీ మునివేలు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచులకు 9 హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్లు, 5 వేస్టేజ్ డెస్ట్రాయ్ మెషిన్లను ఆమె పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందజేసిన ఆధునిక పరికరాలతో గ్రామ సచివాలయాలు, పాఠశాలల మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే పంచాయతీల బృందావనాల్లోని పనికిరాని చెత్తను మెషినరీతో కాల్చివేయాలన్నారు. కార్యదర్శులు, సర్పంచులు బాధ్యతగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు మురళీయాదవ్, కుమార్, బుజ్జి, వసంత, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



పరికరాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ మునివేలు

రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ



ఓటీఎస్ లబ్ధిదారులతో కుమారస్వామిరెడ్డి

పుత్తూరు రూరల్: సొంతింటిపై సర్వ హక్కులు పొందడమే వన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) అని వైఎస్సార్‌సీపీ నేత వై.కుమారస్వామిరెడ్డి అన్నారు. గురువారం పుత్తూరు పరిధిలోని 168 లబ్ధిదారులకు జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం కింద రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. 1983 నుంచి పలు ప్రభుత్వాల పాలనలో ఇళ్ల నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇళ్లపై పూర్తి స్థాయి యాజమాన్యపు హక్కు లేదని, ఇలాంటి లక్షలాది మంది లబ్ధిదారుల కోసమే వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని జగనన్న ప్రభుత్వ తీసుకొచ్చిందన్నారు. తద్వారా వారికి ఇంటిపై సర్వహక్కులు లభిస్తాయని, అంతేకాకుండా అత్యవర పరిస్థితుల్లో ఇంటి పత్రాల ద్వారా బ్యాంకు రుణాలు పొందే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్ రెడ్డి, చైర్మన్ హరి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, గుణశేఖర్, రాధ, వనిత, ఏకాంబరం, నరసింహారావు, పవన్‌కుమార్, చిట్టిబాబు, జాన్ కెనడీ, ఎంఎల్ఓ దిలీప్‌మొదలి పాల్గొన్నారు.

ముగిసిన కొలుపు మహోత్సవం





వివిధ సుగంధ పుష్పాలతో అలంకరించిన అమ్మవారు, గరిగను ఊరేగిస్తున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని క్రిష్ణజమ్మాపురం పంచాయతీ బలిజకండ్రిగలో వెలిసిన చెవుటి గంగమ్మతల్లి కొలుపు మహోత్సవం గురువారం వైభవంగా ముగిసింది. ఉదయం అమ్మవారిని పంచద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. గంగమ్మతోపాటు గరిగకు వివిధ సుగంధ పుష్పాలతో అలంకరణ చేసి, లక్ష్మీ దీపాలతో పూజలు చేశారు. ఊరేగింపుగా వచ్చిన గరిగకు మహిళలు పసుపు నీటి హారతులిచ్చి, కొబ్బరికాయలు సమర్పించారు. సాయంత్రం అమ్మవారి భక్తులు తీసుకొచ్చిన వివిధ సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

మరగాళ్లు.. భక్తి పరవళ్లు

- గంగమ్మకు మొక్కుల చెల్లింపు
- పేరంటాళ్ల వేషధారణలో యువకులు
- మట్టి విగ్రహానికి అలంకరణ, మొక్కులు

సత్యవేడు: సత్యవేడు గంగ జాతర వేడుకల్లో యువకులు, పిల్లలు ‘గంగమ్మకు మరగాళ్ల నృత్యం’ మొక్కును చెల్లించడం ఆనవాయితీ. గంగమ్మను దింపే ముందు,. సాగనంపే తంతు సమయంలో ఈ మొక్కులు చెల్లిస్తారు. సత్యవేడులో బుధవారం రాత్రి ప్రారంభమైన గంగమ్మ ఊరేగింపు గురువారం ఉదయం 7 గంటలకు సాగింది. పర్ణశాలలో గంగమ్మను ఉంచి భక్తుల దర్శనం కల్పించారు. గ్రామపరిధిలో అష్టబంధనం కట్టిన వీధులలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కరగాటం నృత్యప్రదర్శనలు చేశారు. నృత్యం చేస్తున్న యువకులకు గుమ్మడికాయల దిష్టి తీశారు. మరగాళ్ల నృత్యం(ఒంటికి నిమ్మకాయలు దారాలతో గుచ్చుకొని, కాళ్లకు చెక్కలు కట్టుకుని డప్పు మోతకు అనుగుణంగా నృత్యం చేయడం) ఆకర్షణ.

మట్టి విగ్రహానికే అలంకరణ, మొక్కులు

గంగమ్మ రూపాన్ని బంకమట్టితో గ్రామ కుమ్మరి ప్రత్యేకంగా తయారు చేశారు. మట్టి విగ్రహానికి గ్రామ రజకుని ఇంట విశేష అలంకరణ చేశారు. తప్పెట్లు, వాయిద్యాల హోరు, బాణసంచా మోత నడుమ రజకులు వంతుల వారీగా అమ్మవారిని మోస్తూ వీధులలో ఊరేగించారు. భక్తులు అమ్మవారికి కర్పూర హారతులు పట్టారు. మహిషాసుర మర్థిని రూపంలో అమ్మవారు భక్తులకు దర్శమిచ్చారు. వేలాదిగా తరలి వచ్చి భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు.



గంగమ్మకు కరగాటం మొక్కు చెల్లిస్తున్న యువకులు

వేపచీర మొక్కులు

కోరిన కోర్కెలు తీరిన వారు, అనారోగ్యం నుంచి కోలుకున్నవారు వేపచీర(వేపాకు శరీరానికి చుట్టుకొని) పొర్లు దండాలు పెడుతూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు.